క్లుప్తంగా

23న ఓటర్ల జాబితాపై సమావేశం

గంగాధర నెల్లూరు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీ బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీ నేతలు, అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు మోహన్ రాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఎన్నికల నిర్వహణ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి చోరీ



దుండగులు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

పాలసముద్రం: మండలంలోని ఆముదాల గ్రామంలో రైతు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న రాగిని చోరీ చేసిన ఘటన వెలుగు చూసింది. వివరాలు.. ఆముదాల గ్రామానికి నాగరత్నం నాయుడు, సుధాకర్ నాయుడు, అశోక్ బోరు బావులకు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే శనివారం రాత్రి దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దింపి అందులో ఉన్న ఆయిల్, రాగి తీగలను తీసుకెళ్లారని తెలిపారు. పంట చేతికందే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగలు చోరీ చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విజయపురం: మండలంలోని పన్నూరులో ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన కార్తీక హాస్పిటల్ నిర్వాహకులు కంటి వైద్యాధికారి సునీల్ రోగులకు వైద్య పరీక్ష చేశారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత

విజయపురం: పోలీసులు తీసుకొన్న ఏకపక్ష నిర్ణయంతో మనస్తాపం చెందిన మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం మండలంలోని చోటుచేసుకొంది. భర్త ధనంజేయులు నాయుడు కథనం మేరకు, ఈనెల 11న ధనంజేయులు నాయుడు, అతని చెల్లి మేనకకు పొలం వద్ద చిన్న గొడవ జరిగింది. అదే రోజు ఇరువురు స్థానిక పోలీసుస్టేషన్‌కి వెళ్లి పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. అయితే ఎస్‌ఐ రంగాపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేయడంతో ఏక పక్షంగా ధనంజేయులు నాయుడు, ఆమె భార్య గీతపై కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపం చెందిన గీత ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి అన్నారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండులో ఆదివారం అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది కరుణాకర్, ఏసుపాదం, శోభన్, రాజు, గిరిబాబు, కుశలన్, నవీన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

చిన్న సూక్తి త్రిశతి పుస్తకావిష్కరణ



చిన్న సూక్తి త్రిశతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని తపోవనంలో ఆదివారం గుడివాడ అన్నయ్య నాయుడు రచించిన చిన్ని సూక్తి త్రిశతి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పంచ సహస్రావధాని మేడసాని మోహన్ చేతుల మీదుగా పుస్తక ఆవిష్కరణ చేశారు. డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ సంప్రదాయ విలువలను ప్రతిబింబించేది ప్రాచీన సాహిత్యమేనన్నారు. ప్రజల్లోకి ఎంత ఎక్కువగా వెళితే అంతా గొప్పగా సమాజం తీర్చిదిద్దుకుంటుందన్నారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొన్నారు.

గుదిబండ

- పెరిగిన ధరలతో సామాన్యులకు ఇక్కట్లు
- రూ.50 పెంపుతో అదనపు భారం
- నియోజకవర్గంలో 50వేలకు పైగా కనెక్షన్లు



పంపిణీకి సిద్ధంగా ఉన్న సిలిండర్లు



గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్న ఆటో

నగరి: పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు చార్జీలతో సతమవుతున్న పేద ప్రజలపై ప్రభుత్వం మరోసారి భారం మోపింది. వంట గ్యాస్ ధర రూ.50 పెంచడంతో సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.900కు చేరుకుంది. దీంతో సామాన్య ప్రజలు లబోదిబో మంటున్నారు. నియోజకవర్గంలో ఇండియన్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీల ఏజెన్సీలకు సంబంధించి సుమారు 51470 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సగటున ఒక సాధారణ కుటుంబానికి ఏడాదికి 6 నుండి 8 సిలిండర్ల వరకు వినియోగిస్తుంటారు. ఈ లెక్కన ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.300 నుండి రూ.400 అదనపు భారం పడుతోంది. ఈ ధరల పెరుగుదలతో నియోజకవర్గంలోని సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

పేదలపై అదనపు భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు, నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రూ అప్ చార్జీల పేరిట ఇష్టానుసారంగా కరెంటు బిల్లులు పెంచేయడంతో బిల్లులు చూస్తేనే షాక్ కొడుతున్నాయి. అదే సమయంలో ఎన్నికలకు ముందు గ్యాస్ ధరలను స్వల్పంగా తగ్గించిన కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత ధరలు పెంచేయడంతో పేదలపై అదనపు భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు అందజేసింది. తాజాగా పెంచిన రూ.50 గ్యాస్ ధర ఉజ్వల లబ్ధిదారులకు కూడా వర్తించనుండడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజల కష్టాలు తెలుసుకొని ధరలను వెంటనే తగ్గించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సామాన్యులపై భారం తగదు



కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజానీకంపై భారం మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత సిలిండర్లు ఇస్తామని ప్రకటిస్తూనే ధరలు పెంచడం తగదు. పెంచిన ధరలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన ప్రతిసారి ధరలు తగ్గించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉంది. అయితే పెంచడంలో ఉన్న శ్రద్ధ తగ్గించడంలో చూపడం లేదు. ఒక్కసారిగా రూ.50 పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

–కోదండయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, నగరి

సిలిండర్ బుక్ చేయాలంటే భయమేస్తోంది



పెరిగిపోతున్న ధరలు చూస్తుంటే భయమేస్తుంది. గ్యాస్ సిలిండర్ బుక్ చేయాలంటే భయమేస్తోంది. ఎంత జాగ్రత్తగా వాడుకున్నా ఏడాదికి 6–7 సిలిండర్లు అవసరమవుతాయి. వంట గ్యాస్ సిలిండరుపై రూ.50 పెంచడం అన్యాయం. పెంచిన గ్యాస్ ధరలను తగ్గిస్తే పేదలకు మంచి జరుగుతుంది.

–జైలా, ముడిపల్లి

ధరలు తగ్గించాలి



పెంచిన గ్యాస్ సిలిండరు ధరలను వెంటనే తగ్గించేలా చూడాలి. ఓ వైపు నిత్యావసర ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికే కరెంటు బిల్లులు పెరిగిపోయాయి. మళ్లీ అదనంగా గ్యాస్ సిలిండర్ ధరలు పెంచేస్తే సామాన్యులు ఎలా బతకాలి. అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు, నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలు పెంచేసి పేద ప్రజల నడ్డివిరుస్తోంది.

–రవికుమార్, సర్పంచ్, బుగ్గ అగ్రహారం

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



సీతారామాపురంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు

విజయపురం (వడమాలపేట): మండలంలోని సీతారామపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు తన బడిలోని విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవం నిర్వహించారు. పాఠశాలలోని 11 మంది పిల్లలకు ఉపాధ్యాయుడు ప్యాంట్, షర్టులను ఎస్‌ఎంసీ చైర్మన్ మమత చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీతారామపురం పాఠశాలను సొంత డబ్బులతో దశల వారీగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బడికి కావాల్సిన వాటర్ ట్యాంకు, పైప్‌లైన్లు త్వరలో ఏర్పాటు చేస్తామని వివరించారు. ఉపాధ్యాయుడు నాగరాజును గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనికరాజ్, హరినాథ్, రవికుమార్, అంగన్‌వాడీ వర్కర్ తరుణశ్రీ, సిబ్బంది మంజులమ్మ, గ్రామ పెద్దలు గోపాల్ నాయుడు, మోహన్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధితురాలికి రోజా ఆపన్న హస్తం





బాధితురాలికి సాయం అందిస్తున్న మాజీ మంత్రి రోజా, అప్పాదొరైకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

పుత్తూరు: మండల పరిధిలోని కృష్ణసముద్రం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటితో పాటు సర్వస్వం కోల్పోయిన బాధితురాలు సుకన్యకు మాజీ మంత్రి ఆర్కే రోజా ఆపన్న హస్తం అందించారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఆమె సంఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 25 కిలోల బియ్యం, వంటనూనె, పప్పుదినుసులు, కూరగాయలు, ఇతర నిత్యవసర వస్తువులు అందజేశారు. తనవంతు సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, మండల పార్టీ కన్వీనర్ అన్నాలోకనాథం, ఎస్సీ సెల్ నాయకులు లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పాదొరై కుటుంబానికి పరామర్శ

పుత్తూరు మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఏకాంబరం సమీప బంధువు అప్పాదొరై మొదలియార్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం అప్పాదొరై ఇంటికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కే రోజా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పాదొరై కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమలయ్యకు ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ హరి, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, దిలీప్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సత్కారం

నగరి: మండలంలోని మీరాసాహెబ్ పాళెం గ్రామస్తులు మాజీ మంత్రి ఆర్కేరోజాకు ఆత్మీయ సత్కారం చేశారు. మీరాసాహెబ్ పాళెంలో ఆదివారం పార్టీ కార్యకర్తల వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎన్నికైన మాజీ మంత్రిని గజమాలలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు.



నగరి: మాజీ మంత్రిని సత్కరిస్తున్న మీరాసాహెబ్ పాళెం నాయకులు, కార్యకర్తలు

అగ్నిమాపక పరికరాల ప్రదర్శన



అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

నగరి: అగ్నిమాపక వారోత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు అగ్నిమాపక కేంద్రంలో అందుబాటులో ఉన్న పరికరాలను ప్రదర్శనగా ఉంచారు. వాటి పనితీరును అగ్నిమాపక కేంద్రానికి సమీపంగా ఉన్న నగరిపేట గ్రామస్తులకు వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రతాప్, ప్రవీణ్‌కుమార్, మోహన్, సత్య, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వరరావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన ఉంటుందని, అందులో ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఐరాల తహసీల్దార్ కార్యాలయంలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

నివాళి



లక్ష్మయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మయ్య చిత్రపటానికి రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆదివారం నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో లక్ష్మయ్య, వారి కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారని గుర్తు చేసుకున్నారు. తనకు అత్యంత సన్నిహిత కుటుంబం, దగ్గర బంధువైన లక్ష్మయ్య అకాల మరణాన్ని జీర్ణించుకో లేకపోతున్నానని తెలిపారు. అధైర్య పడకుండా ఉండాలని లక్ష్మయ్య కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు దొరబాబుకు భరోసా నిచ్చారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, శేషాద్రి, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి చందురాజు, సర్పంచ్ ధనశేఖర్‌వర్మ, ధనంజయరెడ్డి, ఉపాధ్యక్షుడు ధనశేఖర్‌యాదవ్, రాజ, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కరుణామయుడు ఏసుప్రభు



చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: ప్రపంచ శాంతికోసం జన్మించిన కరుణామయుడు ఏసు ప్రభువు అని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఈస్టర్ ఆదివారాన్ని పురస్కరించుకుని 49 కొత్తపల్లి మిట్టలోని సీఎస్ఐ చర్చిలో శ్యామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు మణి, వెంకటరామిరెడ్డి (గంగాధరనెల్లూరు మండలం) ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, జనార్దన్, చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, కుప్పయ్య, కోఆప్షన్ మెంబర్ యేసయ్య, నాయకులు శ్యామ్, సైకిలా, గోపి, శేషాద్రి, దొరస్వామి, మణి, లోకయ్య, సతీష్, హరిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట సమీపంలో ఎస్.మఠం వద్ద వెలసినశ్రీ ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం దుర్యోధన వధ ఘట్టంలో భాగంగా దుర్యోధనున్ని గంగమడుగు నుంచి భీముడు బయటకు రప్పించే ఘట్టం చూపరులను ఆకట్టుకుంది. దుర్యోధన పాత్రధారి కిరణ్ తన పద్యాలతో కంటతడి పెట్టించాడు. భీమ, దుర్యోధనుల భీకర యుద్ధ సన్నివేశం కళ్లకు కట్టినట్లు చూపించారు. అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం నిర్వహించారు. కంకణం కట్టుకున్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు గోవిందయ్య, మార్కొండయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు వెంకట్రామనాయుడు, సూరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా స్నపన తిరుమంజనం



పురవీధుల్లో దర్శనమిస్తున్న రుక్మిణీ సత్యభామ శ్రీవేణుగోపాలుడు



స్వామివారికి ఆస్థానం చేస్తున్న వేద పండితులు

కార్వేటినగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో వసంతోత్సవంలో భాగంగా రెండవ రోజు ఆదివారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుడి స్నపన తిరుమంజనం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, కొలువు తదితర నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. వసంతోత్సవం సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివార్లను వసంతమండపం వద్దకు వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు వేదపండితులు స్వామివారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, చందనం, పసుపు, తేనె, నారికేళి వంటి సుగంధ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల మధ్య స్వామివార్లకు ఆస్థానం చేపట్టారు. అనంతరం పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో స్వామి, అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు రమేష్, శబరి, గోపాలాచారి, షరాబ్ బాబుసురేష్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ పండుగ





ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ఏసు శిలువతో ర్యాలీ, బలిజకండ్రిగ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

విజయపురం: ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన ఈస్టర్ పండుగ వేడుకలను మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రపంచానికి శాంతి, ప్రేమను బోధించిన ఏసుక్రీస్తును అన్యాయంగా శిలువ వేయడాన్ని గుడ్ ఫ్రైడేగా క్రైస్తవులు శుక్రవారం బాధాతప్త హృదయాలతో జరుపుకున్నారు. ఆయన సమాధిలో నుంచి మూడు రోజుల తరువాత పునరుత్థానం పొందిన రోజు ఈస్టర్‌ను అత్యంత భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈస్టర్ సండే సందర్భంగా మండలంలోని అధిక శాతం క్రైస్తవులు ఆదివారం వేకువజామున తమ పూర్వీకుల సమాధుల వద్దకు చేరుకుని వారి ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం తమ చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పన్నూరు, మాధవరం, విజయపురం, ఆలపాకం, గంగమాంబపురం, బూచివానత్తం చర్చిలో ఈస్టర్ సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి.

పాలసముద్రంలో ...

పాలసముద్రం: మండల పరిధిలోని చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసు మరణాన్ని జయించి లోకానికి తిరిగి వచ్చాడన్న సందేశాన్ని ప్రజలకు అందిండానికి రన్‌ఫర్ కార్యక్రమం నిర్వహించారు. బలిజకండ్రిగ, వెంగళరాజుకుప్పం వీర్లగుడి, రంగాపురం, ఆముదాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి పిల్లలకు క్రీడాపోటీలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. శ్రీకావేరిరాజుపురం చర్చిల్లో పాస్టర్ పాల్‌రాజ్ వృద్ధులకు చీరలు వితరణ చేశారు.